కరాటే.. ఆత్మరక్షణకే.!



ప్రతిభ కనబర్చిన విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ బాబూరావు, మాస్టర్ సత్యనారాయణగౌడ్

మూసాపేట: మూసాపేటలోని ప్రభుత్వ బాలికల పాఠశాల ఆవరణలో ఆదివారం కరాటే విద్యార్థుల బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు మెమెంటోతో పాటు సర్టిఫికెట్లు అందజేశారు. జియాన్ కరాటే డు ఆధ్వర్యంలో కరాటే సీనియర్ మాస్టర్ కె.సత్యనారాయణగౌడ్ సమక్షంలో నిర్వహించిన సర్టిఫికెట్ల ప్రదానోత్సవానికి మాజీ కార్పొరేటర్ పి. బాబూరావు హాజరై బెల్ట్‌లు అందజేశారు. సుమారు 60 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ... ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరమన్నారు. బాలికలు కరాటే నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్స్ ఉపేంద్ర, శ్రావణి, బిందు, వైష్ణవి, నాయకులు భాస్కర్‌రావు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక ఉపనయనం

కూకట్‌పల్లి: నిజాంపేట కామాక్షి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట రోడ్డులోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో సామూహిక ఉపనయనాలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 15 మంది వటువులకు శాస్త్రోక్తంగా తంగిరాల దుర్గ చరణ్ ఈ క్రతువును నిర్వహించారు. అనంతరం వటువులతో తొలి సంధ్యావందనాన్ని చేయించారు. ఈ సందర్భంగా వారిని వేదపండితులు, తల్లిదండ్రులు ఆశీర్వదించారు. అనంతరం అన్న సంతర్పణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కామాక్షి బ్రాహ్మణ సంఘం నేతలు సుధాకర్, శంకర్, నర్సింహారావు, కరుణాకర్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, రామారావు, పార్థసారథి, భువనేశ్వరి, రమణ, కళ్యాణి, బాలపరమేశ్వరి, జయశ్రీ, కుమారి, సోమయాజులు, పీఆర్‌కే మూర్తి, రాంబాబు, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.



రంగస్థలానికి పూర్వ వైభవం


శ్రీకృష్ణరాయభారం ప్రదర్శిస్తున్న కళాకారులు

కూకట్‌పల్లి: తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ సౌజన్యంతో శ్రీపూర్ణేశ్వర నాట్యమండలి ఆదివారం శ్రీ కృష్ణరాయభారం (శయన దృశ్యం), గయోపాఖ్యానం (యుద్ధ ఘట్టం) నాటకాన్ని ప్రదర్శించింది. ఈ నాటకాలు ఆద్యంతం ప్రేక్షకులను రంజింపచేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మొవ్వ దేవనాథసూరి హాజరై మాట్లాడారు. పౌరాణిక పాత్రల పోషణతో రంగస్థలానికి పూర్వ వైభవం వచ్చిందన్నారు. శ్రీ కృష్ణుడిగా బంగారు పెద్ద వెంకటయ్య, దుర్యోధనుడుగా చిట్టి బాల నాగేశ్వరరావు, అర్జునుడిగా కె. శివప్రసాద్, శ్రీకృష్ణుడిగా బి.నారాయణస్వామి, అర్జునుడుగా కె.శివప్రసాద్ తమ పాత్రలకు పూర్తి న్యాయం చేశారు. హార్మోనియం అడవి రాముడు, పి. మంగపతి, ఆహారం పరమేష్ అందించారు.

నేడు వైష్ణవి దుర్గా ఆలయంలో ప్రత్యేక పూజలు


ఆలయంలో శ్రీ వైష్ణవి దుర్గామాత

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని సీసాలబస్తీ వైష్ణవి దుర్గా ఆలయంలో సోమవారం నవగ్రహ, సూర్యనారాయణ, కాలభైరవ, పంచముఖ ఆంజనేయస్వామి, దక్షిణామూర్తి, సప్తమాత్రికలు విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఉంటాయని శ్రీ జయగురు నవ దుర్గా సేవా సమితి తెలియజేసింది. ప్రత్యేక పూజలతో పాటు మహా నైవేద్య, మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ ఉంటాయని వారు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరింది.

కేసీఆర్ హయాంలో నిరాటంకంగా తాగునీటి సరఫరా

ఇప్పుడు ఆ పరిస్థితి లేదు: రంగరాయప్రసాద్

నిజాంపేట్: తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రంగరాయప్రసాద్ అన్నారు. బాచుపల్లిలోని క్రాంతి నగర్‌లో ఆదివారం ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరుతూ కాలనీలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగరాయప్రసాద్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉన్నప్పుడు తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. నిరాటకంగా తాగునీరు సరఫరా, నిరంతర విద్యుత్ సరఫరా నాడు ఉండేదని ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. ప్రజలు ఆలోచించి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కాసాని సుధాకర్ ముదిరాజ్, పైడిమాధవి, సుజాత, బాలాజీ నాయక్, నాయకులు అర్పిత, మధు, సాంబశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇళ్ల లబ్ధిదారులు కంగారు పడొద్దు

ఎమ్మెల్యే వివేకానంద్

జగద్గిరిగుట్ట: బాచుపల్లిలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించిన పట్టాలు, ఇంటి తాళాలు ఇచ్చారని.. కాని వాటిలోకి వెళ్లడానికి మాత్రం అనుమతి లభించడం లేదని జగద్గిరిగుట్టకు చెందిన పలు కాలనీవాసులు వాపోయారు. ఈ విషయమై ఏ అధికారులు స్పష్టత ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఈ సంవత్సరం జూన్‌లో తమ పిల్లల స్కూళ్లు కూడా ప్రారంభమవుతాయని.. వారికి ఎక్కడ అడ్మిషన్ తీసుకోవాలో అర్థం కావడంలేదని వారు ఆందోళన చెందుతున్నారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే వివేకనంద్‌ను కలిసి వారు తమ గోడును వినిపించారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే వివేకానంద్ సానుకూలంగా స్పందించి రెండు వారాలలో ఈ సమస్యకు పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్లు వచ్చిన వారు కంగారు పడాల్సిన అవసరం లేదన్నారు.

శరవేగంగా బతుకమ్మ కుంట పనులు

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలో భూదేవిహిల్స్‌లో నిర్మిస్తున్న బతుకమ్మ కుంట పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రూ.20 లక్షల రూపాయలతో అన్ని హంగులతో ఈ నిర్మాణం చేట్టనున్నట్లు గాజులరామారం ఏఈ తిరుపతి తెలిపారు. అడ్డం 14 మీటర్లు, నిలువు 16 మీటర్ల స్థలం చుట్టూ ఎంఎస్ రేలింగ్ మరియు గేటును కూడా ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే లోపల ఫ్లాట్ ఫాంతో పాటు 5 మీటర్ల చుట్టూ గుండ్రంగా నీరు నిలిచేందుకు రేన్‌ఫోర్స్‌డ్ సిమెంట్ కాంక్రీట్‌తో బతుకమ్మలు వేసేందుకు 0.75 లోతుతో నిర్మాణం జరగనున్నట్లు ఏఈ తిరుపతి అన్నారు. వీలైనంత తొందరగా ఈ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవడానికి చర్యలు చేపడుతున్నామని ఆయన అన్నారు. ఎప్పటి నుంచో కలగా ఉన్న ఈ బతుకమ్మ కుంట నిర్మాణ పనులు ప్రారంభమవడంతో స్థానిక ఆర్‌జీకే, కూనా మహాలక్ష్మీనగర్, భూదేవిహిల్స్ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

బీజేపీకి గుణపాఠం చెప్పాలి

జీసీదళ్ జాతీయ అధ్యక్షుడు కుమారస్వామి

లిబర్టీ: లోక్‌సభ ఎన్నికల్లో బీసీ వ్యతిరేక పార్టీలను గద్దెదించాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దండ్రు కుమారస్వామి కోరారు. బీసీల పట్ల నిర్లక్ష్యంగా ఉదాసీనంగా వ్యవహరించిన కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు బీసీలు నిద్రపోకూడదని విజ్ఞప్తి చేశారు. దళ్ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల కాలంలో ఒక్క బీసీ సమస్యను కూడా పరిష్కరించలేదని ఆరోపించారు. మళ్లీ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో వస్తే బీసీలను బిచ్చగాళ్లుగా మారుస్తుందని అన్నారు.

దుండిగల్ తండా-2లో చెలరేగిన మంటలు

రసాయనాలకు నిప్పు పెట్టిన గుర్తుతెలియని వ్యక్తులు

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ పరిధి దుండిగల్ తండా-2లోని డంపింగ్‌యార్డులో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు రసాయనాలకు నిప్పుపెట్టారు. దీంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఉవ్వెత్తున చెలరేగిన పొగతో సమీప ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాత్రి సమయంలో రసాయనాలకు నిప్పు పెట్టడంతో చిన్నారులు, వృద్ధులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. డంపింగ్‌యార్డును ఇక్కడి నుంచి తరలించాలని కొంత కాలంగా స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అయినప్పటికీ సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించడం లేదన్నారు. డంపింగ్ యార్డులో ఇష్టానుసారంగా కెమికల్‌ను డంప్ చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డంపింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిజాంపేట్ కార్పొరేషన్‌లో నీటి కటకట

- అడుగంటిన భూగర్భజలాలు
- వాటర్ ట్యాంకర్లను ఆశ్రయిస్తున్న జనాలు
- ప్రతి రోజు 500 ట్యాంకర్ల బుకింగ్
- కేవలం 100లోపు ట్యాంకర్లే వస్తున్న వైనం
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- మురికివాడ ప్రాంతాల్లోని ప్రజల పరిస్థితి వర్ణనాతీతం



నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్‌లో నీటి కటకట మొదలైంది. కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి, నిజాంపేట్, ప్రగతినగర్‌లో సుమారు వందలాది అపార్ట్‌మెంట్‌లు, మురికి వాడ ప్రాంతాలు, కాలనీలతో కలిసి ఉన్న ఈ ప్రాంతంలో సుమారు మూడు లక్షల పైచిలుకు జానాభా ఉంది. ఏప్రిల్ మొదటి వారం నుంచే నీటి సమస్య తీవ్రమైంది. ఓవైపు హెచ్ఎండబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో సరఫరా చేసే నీరు సైతం ఐదారు రోజులకు ఒక సారి సరఫరా అవుతుండటంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా మురికి వాడ ప్రాంతాలైన రాజీవ్ గృహకల్ప, సాయినగర్, అంబేడ్కర్‌నగర్, ఇందిరానగర్, రాజీవ్ గాంధీనగర్, ఇందిరమ్మ కాలనీలు, ఎన్టీఆర్‌నగర్ తదితర ప్రాంతాల్లో సామాన్యులు అయితే నీటి కోసం పడరాని పాట్లు పడుతున్నారు.

ట్యాకర్లపైనే ఆధారం....

ఎండల తీవ్రతతో భూగర్భ జలాలు అడుగండిపోతున్నాయి. దీంతో అపార్ట్‌మెంట్ వాసులు తప్పనిసరి పరిస్థితుల్లో ట్యాకర్లపైనే ఆధారపడాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో ట్యాకర్లకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. ట్యాంకర్ డ్రైవర్లు సైతం భౌరంపేట్, దుండిగల్, బొల్లారం గాగిల్లాపూర్ తదితర ప్రాంతాల నుంచి నీటిని తీసుకువచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు. ట్యాంకర్ కోసం అపార్ట్‌మెంట్ వాసులు, గేటెడ్ కమ్యూనిటీ వాసులు పడిగాపులు కాస్తున్నారు.

బుక్ చేసిన వారానికి ట్యాంకర్...

క్యాన్ నెంబర్ ఉన్న వారు హెచ్ఎండబ్ల్యూఎస్ ట్యాంకర్ బుక్ చేసిన వారం రోజులకు రావడం విశేషం. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.సుమారు ప్రతి రోజు 500 మంది వరకు ట్యాంకర్లు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటున్నాట్లు తెలుస్తోంది. కానీ అధికారులు మాత్రం రోజుకు వందలోపు మాత్రమే ట్యాంకర్లు సరఫరా చేస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

15 రోజులకోసారి...



నీళ్ల లేక ప్రతి రోజు ఇబ్బందులు పడుతున్నాం. ట్యాంకర్ కోసం రోజు ఎదురు చూస్తున్నాం.15 రోజులకు ఒకసారి ట్యాంకర్ వస్తే మా అవసరాలు ఎలా తీరుతాయి. ఎన్నిసార్లు అధికారులకు చెప్పిన మాకు నీటి కష్టం తీరడం లేదు. ఇప్పటికైన ప్రతి రోజు ట్యాంకర్ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి..

– శివరాణి, సాయినగర్



నిజాంపేట్ వాటర్ వర్క్స్ కార్యాలయంలో ట్యాంకర్‌లో నీటిని నింపుతూ..

మురికివాడల్లో ట్యాంకర్లు బంద్!

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కొన్ని కాలనీల్లో ఎలాంటి నీటి కనెక్షన్లు లేవు. ఇవ్వడానికి పేదల ఇళ్లకు నోటారీ స్థలాలు కావడంతో అధికారులు నీటి కనెక్షన్లులు ఇవ్వడం లేదు. దీంతో కేవలం మున్సిపల్ అధికారులు ట్యాంకర్ల ద్వారా మాత్రమే నీటిని సరఫరా చేస్తున్నారు. నీటిని సరఫరా చేసే ట్యాంకర్ డ్రైవర్లకు బిల్లులు సక్రమంగా చెల్లించకుంటే ట్యాంకర్ యాజమానులు వెంటనే ట్యాంకర్లను నిలిపివేస్తున్నారు. దీంతో పేద ప్రజలు నీటి కోసం పడుతున్న కష్టం వర్ణానాతీతం. కనీసం పేదలకు గుక్కెడు నీళ్ల సరఫరా చేయలేరా ?అని పేద ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి ప్రజలు ప్రైవేటు ట్యాంకర్‌లను డబ్బులు చెల్లించి కొనుక్కునే పరిస్థితి లేదు. ఓ వైపు ప్రభుత్వం ఇంటింటికీ నీరు సరఫరా చేస్తున్నామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఇది అమలు కాకపోవడం బాధాకరం. ఇప్పటికే అధికారులు స్పందించి వెంటనే ప్రజలకు నీటి కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.

నీటి కనెక్షన్ ఇవ్వండి...



మా కాలనీకి నీటి కనెక్షన్లు ఇస్తే కొంతైన నీటి తిప్పలు తప్పుతాయి. వచ్చే ఒక్క ట్యాంకర్‌తో నీటిని సరిపెట్టుకోవడం కష్టంగా ఉంది. దయచేసి అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నీటి కనెక్షన్లు ఇచ్చే ఏర్పాటు చేయాలి. అప్పటి వరకు ప్రతి రోజు కనీసం ఉదయం సాయంత్రం వేళ్లలో రెండు ట్యాంకులు సరఫరా చేస్తే బాగుంటుంది.

– సుగుణమ్మ, సాయినగర్

ఈటల రాజేందర్‌ను మల్కాజ్‌గిరి ఎంపీగా గెలిపించాలి

మూసాపేట్, అల్లాపూర్ డివిజన్లలో జోరుగా ప్రచారం


అవంతినగర్ తోటలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్, కార్యకర్తలు


శివాజీనగర్‌లో ప్రచారంలో పాల్గొన్న ఈటల రాజేందర్ కోడలు క్షమిత

మోతీనగర్: అవంతినగర్, అవంతినగర్ తోటకాలనీలో మూసాపేట డివిజన్ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ ఆదివారం మల్కాజ్‌గిరి లోక్‌సభ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఆ పథకాలకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. మే 13న ఈటల రాజేందర్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో నాయకులు ఎర్రస్వామి, నాగరాజు, శ్రీనివాస్, సద్గుణరెడ్డి, బసవరాజు, భాస్కర్, శోభరాజన్, రమేష్, శ్రీకాంత్, లింగమూర్తి, నర్సింహ, సుమన్, వాసవి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఈటల కోడలు క్షమిత ప్రచారం..

ఈటల రాజేందర్ కోడలు ఈటల క్షమితవెంకట్రామిరెడ్డి అల్లాపూర్ డివిజన్‌లో జోరుగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిశారు. ఈటల రాజేందర్‌ను మల్కాజ్‌గిరి ఎంపీగా గెలిపించాలని అభ్యర్థించారు. అదే విధంగా నాయకులు, కార్యకర్తలతో కలిసి శివాజీనగర్‌లో ప్రచారం చేస్తూ బీజేపీకి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నార్లపురం శ్రీనివాస్, సుదర్శన్ ముదిరాజ్, దామోదర్ నేత, సాయి చందు, శ్రావణ్, మహేందర్‌రెడ్డి, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

కదం తొక్కిన శేరిలింగంపల్లి కాంగ్రెస్ దళం

చేవెళ్ల అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మద్దతుగా భారీ బైక్ ర్యాలీ


ప్రజలకు అభివాదం తెలుపుతున్న చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

కూకట్‌పల్లి: శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో పార్టీ ఇన్‌చార్జి వి. జగదీశ్వర్‌గౌడ్ ఆదివారం చేవెళ్ల లోకసభ అభ్యర్థి జి. రంజిత్‌రెడ్డికి మద్దతుగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీటీడీసీ చైర్మన్ పటేల్ రమేష్ పాల్గొని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరిచే విధంగా చేవెళ్లలో రంజిత్‌రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ముందుగా పాపిరెడ్డినగర్‌లోని హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఆస్‌బెస్టాస్‌కాలనీ కమాన్ నుంచి బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.

◆ వివేకానందనగర్, ఆల్విన్‌కాలనీ, హైదర్‌నగర్, మియాపూర్ డివిజన్ల మీదుగా చందానగర్ వరకు బైక్ ర్యాలీ కొనసాగింది. ఈ ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు. రంజిత్‌రెడ్డి గెలుపుని ఎవరూ ఆపలేరన్నారు. భారత్‌లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటం ఇప్పుడున్న పరిస్థితుల్లో చాలా అవసరమన్నారు. రాహుల్ గాంధీ నాయత్వాన్ని బలపరిచే విధంగా చేవెళ్ల పార్లమెంట్‌లో భారీ మెజార్టీతో రంజిత్‌రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

దూరవిద్య మంచి అవకాశం

జీడిమెట్ల: దూరవిద్య ద్వారా చదివిన విద్యార్థులు సైతం పట్టుదలతో చదివితే అనుకున్నది సాధించవచ్చునని వివేకానంద విద్యా మందిర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం పాఠశాలలోని దూరవిద్య స్కూల్‌లో 10వ తరగతికి కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు హాల్ టికెట్లు జారీ చేశారు. అనివార్య కారణాలతో.. ఆర్థిక ఇబ్బందులతో పాఠశాలకు దూరమైన విద్యార్థులకు దూరవిద్య కోర్సు చదువుకునేందుకు మంచి అవకాశం కల్పిస్తుందని తెలిపారు. ఇంకా ఎవరైనా విద్యార్థుల దూరవిద్యా కోర్సు ద్వారా 10వ తరగతి పరీక్షలు రాయాలనుకుంటే వివేకానంద పాఠశాలలోని స్టడీ సర్కిల్‌లో సంప్రదించాలని కోరారు. విద్యార్థులకు హాల్ టికెట్లు అందజేసిన వారిలో పాఠశాల కరస్పాండెంట్ సునీత వైస్ ప్రిన్సిపల్ లత నాలెడ్జిహైస్కూల్ ప్రిన్సిపాల్ రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

మానవత్వం అలవర్చుకోవాలి

సనత్‌నగర్: సనత్‌నగర్‌లోని విశ్వ మానవ సంక్షేమ సంఘం 37వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. పెరుగుతున్న జనాభా, సమాజంలో పెరుగుతున్న హింస, స్త్రీలపై అత్యాచారాలు, కుల మత ఘర్షణలు, పేద వారిలో పొదుపు ఆవశ్యకత, పర్యావరణ పరిరక్షణ, మురికివాడలకు చెందిన చిన్నారులకు ఉచిత ట్యూషన్ సెంటర్లు, చేతబడులు, బాణామతి, మూఢ నమ్మకాలపై ప్రజల్లో చైతన్యం కలిగించే లక్ష్యంగా విశ్వ మానవ సంక్షేమ సంఘం సేవలను కొనసాగిస్తూ వస్తోంది. జెకెకాలనీ ఫెడరేషన్ అధ్యక్షుడు మల్లు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలకు రిటైర్డ్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ విట్టా వెంకట్రామయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పిల్లలు మంచితనం, మానవత్వాన్ని అలవర్చుకోవాలని అప్పుడే దైవం కూడా తోడుగా ఉంటాడన్నారు. మస్తాన్‌రావు పెనల మాట్లాడుతూ.. పిల్లల్లో క్రమశిక్షణ, భారతీయ సంస్కృతిపై అవగాహన కల్పించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు.

రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి




ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే కృష్ణారావు, ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ డివిజన్‌లోని ఇందూ ఫార్‌చ్యునర్ ఫీల్డ్, వన్‌సైట్ అపార్టుమెంట్‌లలో ఆదివారం బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన బీఆర్ఎస్ మల్కాజ్‌గిరి లోక్‌సభ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని వారికి పరిచయం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధికి కృతజ్ఞతగా రాగిడి లక్ష్మారెడ్డికి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఎన్నో వేల కోట్ల రూపాయలతో కూకట్‌పల్లి నియోజకవర్గంతో పాటు తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా మాజీ సీఎం కేసీఆర్ నిలబెట్టారని గుర్తు చేశారు. గతంలో వర్షం వస్తే ఈ ప్రాంతంలోని వారు బయటకు వెళ్లాలంటే భయపడేవారన్నారు. నేడు ఆ పరిస్థితి లేదన్నారు.

జరిగిన అభివృద్ధికి కృతజ్ఞతగా బీఆర్ఎస్‌కు ఓటు వేయండి..

నియోజకవర్గంలో డ్రైనేజీ వ్యవస్థను ఎంతో మెరుగుపరుచుకున్నామని అన్నారు. ఏ కాలనీ, బస్తీని చూసినా సీసీ రోడ్లతో అందంగా తీర్చిదిద్దామని తెలిపారు. అందులో కేపీహెచ్‌బీ డివిజన్ అత్యంత సుందరంగా మారిందన్నారు.ఇండోర్‌స్టేడియాలు, పార్కులు, కమ్యూనిటీహాళ్లను నిర్మించామన్నారు. నాలాల అభివృద్ధికి నిధులు కేటాయించామని ఇప్పుడు ఆ పనులు కూడా జరుగుతున్నాయని తెలిపారు. జరిగిన అభివృద్ధికి కృతజ్ఞతగా బీఆర్ఎస్‌కు ఓటు వేసి అత్యధిక మెజార్టీ ఇవ్వాలని కోరారు.కార్యక్రమంలో కార్పొరేటర్ మందడి శ్రీనివాస్, కృష్ణారెడ్డి, సాయబాబా చౌదరి, శ్యామల రాజు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీతో రాగిడి లక్ష్మారెడ్డి భేటీ



కూకట్‌పల్లి: లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌లతో రాగిడి లక్ష్మారెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచారంలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ఈనెల 24న రాగిడి లక్ష్మారెడ్డి నామినేషన్ వేస్తున్నారని తెలిపారు. ఆయన గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని ఇంటింటికీ వెళ్లి వివరించాలని సూచించారు.